క్లుప్తంగా

ఘనంగా శోభయాత్ర



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆంజనేయ స్వామి సేవా దళ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని గురువారం లింగశెట్టిపాళ్యం వీధిలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభయాంజనేయ స్వామి సేవాదళ్ సభ్యులు, పట్టణ ప్రజలు హనుమాన్ జెండాలతో పట్టణ పురవీధుల్లో ఆంజనేయస్వామిని ఊరేగించారు. బైకు ర్యాలీ నిర్వహించి శోభ యాత్ర చేపట్టారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ

ఎన్పీకుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9:30 గంటలకు పొదుపు సంఘాల మహిళలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతులమీదుగా మూడో విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేస్తామని ఎంపీపీ రాము, ఎంపీడీఓ ఆదినారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

రామాలయానికి విరాళం

నల్లచెరువు: మండల కేంద్రంలోని బసవన్నకట్ట వీధిలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి నల్లచెరువుకు చెందిన ఎనుగొండ నరసమ్మ గురువారం రూ.15 వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు ఆమెను సన్మానించి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, సర్పంచ్ పంచరత్నమ్మ, ఆనంద్‌రెడ్డి, రామాంజులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువులో ఇఫ్తార్ విందు

నల్లచెరువు: మండల కేంద్రంలోని జామియా మజీద్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నూరుల్లా పాల్గొన్నారు. మజీద్ ముతవలి బట్టీ హైదర్‌వలి, ప్రభుత్వ ఖ్వాజీ అమీర్‌ఖాన్ ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం మైనార్టీలతో నిర్వహించిన సమావేశంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మాట్లాడారు. ముస్లిం, మైనారిటీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుల్హన్ పథకం అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ మూడు రోడ్ల కూడలిలో గురువారం వందేమాతరం టీం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడుతూ.. వేసవికాలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వందేమాతరం టీం సభ్యులు బాగేపల్లి శ్రీనాథ్, విశ్వనాథ్, రవీంద్ర, అశోక్, వెంకటరమణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రంలో వసతులపై ఆరా తీస్తున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

ధర్మవరం: పట్టణంలో మొత్తం 15 సెంటర్లలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ సుధాకర్‌నాయక్ తెలిపారు. గురువారం పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 2510 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటల్లోపు విద్యార్థులు చేరుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన ఐచర్

గార్లదిన్నె: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం ఐచర్ వాహనం బోల్తా పడిన ఘటనలో ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు..గార్లదిన్నె నుంచి వేరుశనగ పప్పు లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం వే బ్రిడ్జి వద్దకు బయలుదేరింది. ఈక్రమంలో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తాపడింది. అయితే ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

రాములోరి కల్యాణం.. తరించిన భక్తజనం





నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి , బత్తలపల్లి: పోట్లమర్రిలో ఉట్లమాను పరుష

ఓడీ చెరువు: వంచిరెడ్డిపల్లిలో గురువారం సీతారాముల కల్యాణం వేడుకగా సాగింది. వేద పురోహితులు రంగనాథశర్మ, సునీల్ బృందం ఆధ్వర్యంలో సీతారాములకు కల్యాణం జరిపించారు. సాయంత్రం పల్లకీలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంద్‌నాయక్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో అర్చకులు బాలరంగాచార్యులు, రమేషాచార్యుల ఆధ్వర్యంలో సీతారాములకు కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి వారి పట్టు వస్త్రాలను వేలం వేశారు. శ్రీరాముల వారి పట్టు పంచెను రూ.7,700లకు పుల్లప్ప కైవసం చేసుకోగా, సీతమ్మ వారి పట్టు చీరను రూ.11 వేలకు కొండేటి రమేష్ దక్కించుకున్నారు. అలాగే రెండు కళశం ప్రమిదలను వేలం వేయగా.. మొదటిది రూ.9 వేలకు ప్రసాద్ కైవసం చేసుకోగా.. రెండవది పెద్ద చంద్రాయుడు రూ.20 వేలకు దక్కించుకున్నారు. అలాగే ఉప్పలపాడులో సర్పంచ్ లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

తాడిమర్రి: తాడిమర్రిలోని ఓసీ, బీసీ, ఎస్టీ కాలనీల్లోని రామాలయాల్లో శ్రీరామనవమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోదండ రామస్వామి ఆలయంలో వేద పండితులు సంతోష్ శర్మ, విక్రమార్క శర్మలు సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి, ప్రసాదం స్వీకరించారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని పెద్దబజారు, అంబేద్కర్ నగర్‌తో పాటు పెడబల్లి, పాపన్నగారిపల్లి, పి కొత్తపల్లిలోని రామాలయాలు సీతారాముల నామస్మరణతో మార్మోగాయి. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నేత్రపర్వంగా కల్యాణం జరిపించారు. పి.కొత్తపల్లి, పాపన్నగారిపల్లి గ్రామాల్లో సీతారాముల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువు దీర్చి విద్యుత్ దీపకాంతుల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. యువకులు పానకం పంపిణీ చేశారు.

నల్లమాడ/గాండ్లపెంట/తలుపుల/తనకల్లు: శ్రీరామనవమి సందర్భంగా గురువారం నల్లమాడలోని రామాలయం, పెద్దకోట్లపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేద బ్రాహ్మణులు సంప్రదాయబద్ధంగా సీతారాములకు కల్యాణం జరిపించారు. పెద్దకోట్లపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవంలో చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే తలుపుల మండలంలోని బలిజసేట రామాలయం, ఓబీఆర్ కొత్తపల్లి, వేపమానిపేట తదితర గ్రామాల్లో సీతారాములకు కల్యాణం జరిపించారు. తనకల్లు మండల కేంద్రంతో పాటు కొక్కంటిక్రాస్, పెద్దపల్లి, ఈతోడు, చీకటిమానిపల్లి, బొంతలపల్లి, కొక్కంటి గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి ఘనంగా నిర్వహించారు.

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో గురువారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొని స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచరత్నమ్మ, టెంపుల్ చైర్మన్ దేవరింటి భాస్కర్ రెడ్డి,మాజీ చైర్మెన్ నగేష్, కదిరి మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలో గురువారం శ్రీరామ నవమి సందడి నెలకొంది. రామ్‌నగర్‌లోని కోదండ రామస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పలు వార్డుల్లో అన్నదానంతో పాటు ఉట్లమాను కొడుతూ యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు కాలేజి సర్కిల్‌లో సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు పానకం పంపిణీ చేశారు.

బత్తలపల్లి: బత్తలపల్లి మండలంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. పోట్లమర్రిలోని ఆంజనేయస్వామి దేవాలయం ముందు ఉట్లపరుష నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీపడ్డారు. గంటాపురం, వేల్పుమడుగు తదితర గ్రామాల్లో సీతారాముల విగ్రహాలకు పూజలు చేవారు. ముష్టూరు బీసీ కాలనీలో రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించారు. లింగారెడ్డిపల్లిలో మాజీ ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి గ్రామ పెద్దలతో కలిసి సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ పూజల్లో పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: శ్రీరామనవమి సందర్భంగా గురువారం పుట్టపర్తి పట్టణం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. మున్సిపాలిటీలో పరిధిలో 17వ వార్డు బీడుపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయం, రామాలయం, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, ప్రశాంతి గ్రామంలో ఉన్న అయోధ్య రామాలయాల్లో సీతారాములు కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం పట్టణ కన్వీనర్ రంగారెడ్డి బీడుపల్లి గ్రామంలో 40 మందికి చీరలు పంపిణీ చేశారు. బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామంలో టీడీడీ ఆధ్వర్యంలో సీతారామల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అగ్రహారం సర్పంచ్ నాగేంద్రమ్మ నరశింహులు కుటుంబ సభ్యులు రూ.50,101 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గోపీ స్వామి, గుండా శ్రీనివాసులు, సిరివేలి నాగభూషణ, మండ్లీ అంజనేయులు, రామకృష్ణ, నారాయణస్వామి, హరీష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. దేశ విదేశాలకు చెందిన భక్తులు వేడుకల్లో పాల్గొని శ్రీరాముడు, సత్యసాయి నామాన్ని స్మరించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తులు రామనామ స్మరణల నడుమ సీతారామల కల్యాణం కనుల పండువగా జరిగింది. సాయంత్రం సత్యసాయి విద్యా సంస్థల విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు.

కదిరి టౌన్: రామనామస్మరణతో కదిరి పట్టణం మార్మోగింది. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తదితరులు సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. పంచముఖ అంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు నరసింహచార్యులు, కుమార్‌స్వామి మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాములకు కల్యాణం జరిపించారు.

కొత్తచెరువు:మండల కేంద్రంలో మరువ ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారామలక్ష్మణ సమేత హనుమ విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నతేరులో ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి, పుర వీధుల్లో ఊరేగించారు. మండల పరిధిలోని మైలేపల్లి ఆంజనేయ స్వామి దేవాలయ సమీపంలో ఉట్లమాను పరుష నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాల్ మిల్ సూరి బీరువాను బహుమతిగా అందజేశారు.

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: మామిళ్లపల్లిలోని సీతారాముల ఆలయంలో నాగయ్య శెట్టి, కొండారెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో కలసి రాముల వారి కల్యాణోత్సవం జరిపించారు. చెన్నేకొత్తపల్లి మండలంలో న్యామద్దల, వెంకటంపల్లి, చెన్నేకొత్తపల్లి, మేడాపురం, ప్యాదిండి, ఓబుళంపల్లి, కనుముక్కల, బసంపల్లి, బోగసముద్రం, గంగినేపల్లి, వెల్దుర్తి, బసినేపల్లి గ్రామాల్లోని రామాలయాల్లో కల్యాణోత్సవం జరిపించారు.



పుట్టపర్తి టౌన్: ప్రశాంతి గ్రాం వద్ద సీతారామలక్ష్మణ విగ్రహాల ఊరేగింపు



ఓడీ చెరువు: వంచిరెడ్డిపల్లి రామాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ముదిగుబ్బ: పాతూరులో సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



గాండ్లపెంటలో సీతారాముల విగ్రహాలకు పూజలు



కదిరి టౌన్: తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు



ఓడీ చెరువు: భజన చేస్తున్న భక్తులు



కొత్తచెరువు: రథంలో ఊరేగుతున్న రామలక్ష్మణులు



నల్లమాడ: రామాలయంలో..



కనగానపల్లి: కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



ధర్మవరం అర్బన్: భక్తులకు పానకం పంపిణీ

'డిక్కీ' జోనల్ ఇన్‌చార్జ్‌కు సన్మానం



కోలా వెంకటరమణను సన్మానిస్తున్న పాత్రికేయులు

కదిరి: స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం డిక్కీ (దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించబడిన కోలా వెంకట రమణను కదిరి డివిజన్ పరిధిలోని పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. ఈయన గతంలో ఓ దినపత్రికలో పాత్రికేయుడుగా 10 ఏళ్లకు పైగా పని చేశారు. ఆ తర్వాత ఆయనే స్వయంగా 'విజయస్వప్నం' అనే మాసపత్రికను నడిపారు. ఈయన మూడేళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లా డిక్కీ కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. ఈయన పనితీరును మెచ్చి ఈయనను రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ ఇన్‌చార్జ్‌గా ఈ మధ్యే ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు రామాంజులు, శివాజీ, ప్రసాద్, చలపతి, జయచంద్రారెడ్డి, పాల్గొన్నారు.

హోరాహోరీగా గిరిక బండి లాగుడు పోటీలు



ఉరవకొండ: బూదగవి గ్రామంలో గిరుకుబండి లాగుడు పోటీలు జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం గిరిక బండ్ల లాగుడు పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా వందలాది ఎద్దుల బండ్లు పోటీ పడ్డాయి. మొదటి స్థానంలో బండారు చక్రవర్తి నిలవగా.. 17 తులాల వెండి, రెండో స్థానంలో నిలిచిన బోయ గిరికు 11 తులాల వెండి, మూడో స్థానంలో నిలిచిన ఆగలూరప్పకు 6 తులాల వెండి అందజేశారు.

విడపనకల్లు: మండలంలోని చీకలగురికిలో గురువారం శ్రీరామనవమి పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గిరిక బండి లాగుడు పోటీలు నిర్వహించారు. 10 జతల ఎద్దుల బండ్లు పోటీలో తలపడ్డాయి. ఇందులో సుంకప్ప అనే రైతుకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో, చిన్నారెడ్డి ఎద్దులు ద్వితీయ స్థానంలో, గడిగే మల్లికార్జున ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి సహకారంతో వరుసగా రు.6 వేలు, రూ3 వేలు, రూ.1500 వైఎస్సార్‌సీపీ నాయకులు మరిస్వామి, బొజ్జప్ప, చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అశోక్, సురేష్, నరసింహులు, గోపాల్, చందు తదితరులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ వైరు



ధర్మవరం: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో గురువారం విద్యుత్ వైరు తెగి కింద పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, తెగిపోయిన విద్యుత్ వైరుకు మరమ్మతులు చేశారు.

మామిడి చెట్లకు నిప్పు

కుందుర్పి: మండలంలోని శీగలపల్లి గ్రామానికి చెందిన రైతు రుక్మిణమ్మకు చెందిన రెండు ఎకరాల్లో మామిడి చెట్లకు గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయింది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో కడుపునొప్పి తాళలేక గురువారం ఆదిలక్ష్మి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదిలక్ష్మి కొన్ని రోజులుగా తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతుండేది. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్ర మాత్రలు మింగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆదిలక్ష్మిని కుటుంబ సభ్యులు వెంటనే గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఆమెను అనంతపురం తరలించారు.

జంబుకేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలో కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 9వ తేదీ వరకు జరుగుతాయని గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆలయంలో అంకుర్పారణ, కలశస్థాపన, రాత్రి రక్షాబంధనం, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

మొక్కజొన్న పంటకు నిప్పు

విడపనకల్లు: మండలంలోని వేల్పుమడుగులో రైతు నాగరాజురెడ్డికి చెందిన మొక్కజొన్న పంటకు నిప్పంటుకుని గురువారం కాలిపోయింది. ఆయన మూడెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. రెండు రోజుల్లో పంటను కోత కోయాలనుకుంటున్న సమయంలో గుర్తు తెలియన వ్యక్తులు నిప్పు పెట్టారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పంటంతా కాలిపోయి మూడు లక్షల వరకూ నష్టం వచ్చినట్లు ఆయన వాపోయాడు. ఉరవకొండ అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

చిగిచెర్లలో పార్వేట ఉత్సవం



కుందేలుతో పార్వేట ఆడుతున్న చిన్నారులు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని రామంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయంత్రం శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగింపుగా గ్రామం వెలుపల ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లారు. అక్కడ స్వామి వారి చిత్రపటాన్ని ఉంచి పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు.

జూదరుల అరెస్ట్

చిలమత్తూరు: మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా రూ.9150 నగదు స్వాధీనం చేసుకోవడంతో ఐదు బైక్‌లు సీజ్ చేశామన్నారు.

నేటి నుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కూడేరు: దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా ప్రఖ్యాతిగాంచిన కూడేరులోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమై ఏప్రిల్ 8 వరకు కొనసాగుతాయని ఈఓ బి.బాబు గురువారం తెలిపారు. 31న బండారు(బ్రాహ్మణ) వంశీకులు ఆధ్వర్యంలో శివ పార్వతులకు పుణ్యావాచనం, ఏప్రిల్ 1న రాత్రి 7 గంటలకు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శేష వాహనంపై శివ పార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. 2న ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వ్యాఘ్ర వాహనంపై, 3న వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెమలి వాహనంపై, 4న కమ్మ సంఘం ఆధ్వర్యంలో నంది వాహనంపై, 5న వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఐరావత వాహనంపై ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 6న ఉదయం 9:45 నిమిషాలకు మడుగు తేరు, సాయంత్రం 6 గంగలకు రథోత్సవం, 7న కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అశ్వ వాహనంపై ఊరేగింపు, పార్వేట ఉత్సవం, 8న పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని ఆయన తెలిపారు.

జ్యోతుల ఉత్సవానికి విరాళం



నిర్వాహకులకు విరాళాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: మండల పరిధిలోని పి కొత్తపల్లి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించే చౌడేశ్వరీ దేవి జ్యోతుల ఉత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి రూ.50,000 విరాళం అందించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఉత్సవ నిర్వాహకులు సామిరెడ్డి, రెడ్డప్ప, సూర్యనారాయణకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, పాండురంగ ప్రసాద్, పెద్ద రెడ్డప్ప, కృష్ణమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

తనకల్లు: ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దపల్లిలో తవళం ముక్తియార్ బాషా ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముక్తియార్‌బాషా బెంగళూరులో స్థిరపడినప్పటికీ సొంతూరుపై మమకారంతో ఏటా ఇక్కడ పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మల్లిరెడ్డిపల్లి పంచాయతీలోని పలు గ్రామాలకు సొంత డబ్బులతో మట్టి రోడ్లు వేయించారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లాయర్ ఉమామహేశ్వర్ రెడ్డి, నాగం రాజారెడ్డి, రవినాయక్, విద్యాసాగర్ రెడ్డి, దశరథ, రఫీక్‌బాషా, కిష్టప్ప పాల్గొన్నారు.

నేడు సామూహిక వివాహాలు

మడకశిర: మండలంలోని నీలకంఠాపురం దేవస్థానాల ఆవరణంలో శుక్రవారం ఉదయం సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.15 నుంచి 7.45 గంటల వరకు జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవంతో పాటు సామూహిక వివాహాలు నిర్వహించననున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా పట్టనాయకనహళ్లి మఠాధిపతి నంజావధూతస్వామి హాజరవుతారన్నారు. అలాగే ఉదయం 9.30 గంటలకు ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నీలకంఠాపురం దేవస్థానాలకు చెందిన భక్తిగీతాల ఆవిష్కరణ, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడకశిర(అగళి): అగళి మండలంలోని రామనపల్లి సమీపాన గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసన్న, మంజునాథ్ గాయపడ్డారు. మడకశిర మండలం గుండుమలకు చెందిన దాసన్న ద్విచక్ర వాహనంలో స్వగ్రామం నుంచి రొళ్ల మీదుగా అగళి మండలం వైపు బయలుదేరాడు. రామనపల్లికి మంజునాథ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో జాతీయ రహదారిలో అగళి వైపు వెళ్తూ అకస్మాత్తుగా కుడి వైపు తిరిగి అడ్డు రావడతో వెనకాల వేగంగా వస్తున్న దాసన్న వాహనం ఢీకొంది. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. 108లో క్షతగాత్రులను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.